క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



పి.ధర్మవరం పాఠశాలలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎస్.రాయవరం : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల సమతా సైనిక్ దళ్ సభ్యులు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించినట్టు మండల అధ్యక్షుడు గారా ప్రకాష్‌రావు తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు అంబేడ్కర్ జయంతిన బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ సభ్యుడు పోలినాటి అప్పారావు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో నేడు గడపగడపకు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నాగులాపల్లి వినాయక ఆలయం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు,డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొంటారన్నారు. పార్టీ నేతలు,కార్యకర్తలు,అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : మండలంలో కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. గుడివాడ ఫీడర్ పరిధిలో గల గ్రామాలు గుర్రాజుపేట, గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, కొత్తపోలవరం, రేవుపోలవరం, చినఉప్పలం తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు పనులు నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలన్నారు.

అనారోగ్యంతో లైన్‌మన్ మృతి



రాజుబాబు(ఫైల్)

కోటవురట్ల : కె.వెంకటాపురం 33 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న చిటికెల రాజుబాబు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. రాజుబాబు అనారోగ్యం కారణంగా పది రోజులుగా విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడమే కాకుండా ఏ సమయంలో విద్యుత్ సమస్య కోసం ఫోన్ చేసినా వెంటనే స్పందించేవారని, అందరితో మంచి అనుబంధం ఏర్పరుచుకున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ, విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమౌళి, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ పిలుపునిచ్చారు. నాగులాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోకి వచ్చి ప్రజల ఆరోగ్య పరిస్థితులు గుర్తించి వారికి వైద్యం అందిస్తున్నారన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిన తీరుపై ఆరా తీయడంతో పాటు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వారికి అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం దోహదపడుతుందన్నారు. పేదోడి సొంతింటి కల జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న సాగునీటి కాలువలో సిల్టు తొలగించేలా చూడాలని కొంతమంది స్థానికులు రమణమూర్తిరాజు దృష్టికి తీసుకురావడంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ జామి చినమ్మలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,నాగులాపల్లి ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్,పార్టీ నేతలు దొడ్డి వరహా, బుజ్జి, బొడ్డేడ బుజ్జి, సింగర్ రాజు, యల్లపు వెంకటప్పారావు, దానకృష్ణ, బొద్దపు శ్రీరామమూర్తి,పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల ఉమా మహేశ్వరరావు, కోనపల్లి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, అచ్యుతాపురం జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సర్మాల కుమార్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

యలమంచిలి : అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని 8 వ వార్డు కౌన్సిలర్ ఒగిబోయిన ప్రసన్న అన్నారు. బుధవారం కాకివాని వీధిలో వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆమె జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చారిత్రాత్మకమైనవిగా ఆమె ఇంటింటికీ వెళ్ళి మహిళలకు తెలియజేశారు. లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల పట్ల వారి అభిప్రాయాన్ని తెలుసుకుని వారి ఇళ్లకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ స్టిక్కర్లను అతికించారు.కార్యక్రమంలో ఒగిబోయిన చిరంజీవి, పి. శంకర్,వలంటీర్లు పాల్గొన్నారు.



నాగులాపల్లిలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ



సీఎం ఫొటో స్టిక్కరును ఇంటికి అతికిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

పాయకరావుపేట : ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాల పై గ్రామాల్లో ప్రజలు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా నమ్మకం నువ్వే జగన్ జగనన్నే మా భవిష్యత్తు అనే నినాదంతో నాయకులు, సచివాలయ కన్వీనర్లు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మాసాహేబుపేట, పాల్తేరు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడుతున్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరుపై అడిగి సంతృప్తి చెందిన తర్వాత స్టిక్కరును డోర్‌కు అతికిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి శ్రీనివాస్, ఎంపీటీసీ కొంతం నరేష్, సచివాలయ కన్వీనర్లు బొలిశెట్టి శ్రీను, గంటా నాగేశ్వరరావు, కంకిపాటి దొరబాబు, కొంతం దేవి పాల్గొన్నారు.



8వ వార్డులో ఇంటింటా సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేతలు



వెంకటాపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతుంది. వెంకటాపురం, వాడనర్సాపురం, దిమిలి, గోకివాడ, మురకాడ తదితర గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం కోసం రూపొందించిన ప్రశ్నలను అడిగి జవాబులను నమోదు చేస్తున్నారు. అనంతరం ఫోన్, ఇంటికి అంటించుకునే స్టిక్కర్లు అందజేశారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు జగనన్నపై తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

పార్టీ ఆదేశాలే శిరోధార్యం

- 16 నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'
- ప్రజాప్రతినిధులకు వీసం పిలుపు

నక్కపల్లి: పార్టీ శ్రేణులన్నీ ఐకమత్యంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన నక్కపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 16న పుణ్యక్షేత్రం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఉపమాక నుంచి మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నేతృత్వంలో చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వచ్చే శనివారం మండలంలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తరలిరావాలన్నారు. పెద్దల ఆదేశాల శిరసావహించి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో ఇక్కడ ఎమ్మెల్యేను గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ప్రజలే గుణపాఠం చెప్తారన్నారు. జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పొందిన వారు ప్రతి ఇంట్లోను ఉన్నారన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించే బృహత్తర బాధ్యత గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లదేనన్నారు. జగనన్న ప్రభుత్వానికి కళ్లు చెవులు మీరేనన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు, బీసీ సెల్ సీనియర్ నాయకులు మనబాల తాతారావు, ఎస్సీ సెల్ నాయకులు కాకర వెంకటరావు, సర్పంచ్‌లు నేతల రత్నకుమారి, మైలపల్లి శ్రీనివాస్, పొడగట్ల వెంకటేష్, కర్రి రాజబాబు, సురేష్‌వర్మ, వెదుళ్ల రమణ, భార్గవ్, కొండలరావు, కాళ్లశ్రీను, శంకర్రావు, ఎంపీటీసీలు తోట సత్తిబాబు, కొల్నాటి బుజ్జి, తంగెళ్లకృష్ణ, గొర్ల గోవిందు, గంటా తిరుపతిరావు, నిట్లగోవిందు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఉద్దేశించి మాట్లాడుతున్న వీసం రామకృష్ణ

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులకు అవకాశం దొరుకుతుందని మండల పరిషత్ వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని చెర్లోపాలెంలో చిన చెరువును ఉపాధిహామీ పథకం ద్వారా సర్పంచ్ సత్యవతితో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువలు ఈ పథకం ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అలాగే పథకంలో పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాయల ప్రకాష్, ఎపీవో ఎరకయ్య, మాజీ ఎంపీటీసీ చిలుకునాయుడు, పార్టీ నేతలు నమ్మి చిరంజీవి, అప్పికొండ ప్రసాద్, అమరపల్లి కేశవరావు, ఫీల్డ్ అసిస్టెంట్ పల్లా రఘురాం పాల్గొన్నారు.



చెర్లోపాలెం చిన చెరువులో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి, వైస్ ఎంపీపీ లక్ష్మి

ఎన్నికల హామీల అమలు ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే

మునగపాక : ఎన్నికల హామీలను అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరొక అవకాశం కల్పించాలని ఉమ్మలాడ సచివాలయ కన్వీనర్, దళిత విభాగం మండల అధ్యక్షుడు మందా రాము కోరారు.మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం ఇంటింటా ప్రచారం చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా అందిన పథకాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అందజేసిన 5 ప్రశ్నలకు సంబంధించి సర్వే నిర్వహించి ఇంటి యజమానుల సమ్మతంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను అంటించి ప్రభుత్వం నుంచి మాకు మేలు జరుగుతుందంటూ మిస్ట్‌కాల్స్ ఇప్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ఈ ప్రభుత్వం హయాంలో మేలు జరుగుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట గృహ సారథులు పాల్గొన్నారు.



ఉమ్మలాడలో మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలు అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ రాము

వినూత్న నిరసన



నోట్లో పచ్చగడ్డి పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కలాసీలు

రాంబిల్లి: రసూల్ డెకర్ పరిశ్రమ వద్ద బుధవారం కలాసీలు వినూత్న నిరసన వ్యక్తం చేసారు. నోట్లో పచ్చగడ్డి పెట్టుకొని తింటూ తమ నిరసన వ్యక్తం చేశారు. తమకు ఉపాధి కల్పించాలని డిమాండు చేస్తూ కలసీలు ధర్నా నిర్వహిస్తున్నారు. కలాసీల నాయకులు సూరిబాబు, అప్పలనాయుడు, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ వరాలు

ఎస్.రాయవరం : జగనన్న సీఎం అయ్యాక పేద ప్రజలకు సంక్షేమ వరాలు కురిసాయని వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు అన్నారు. సర్వసిద్ధి, వేమగిరి గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కొన్ని గృహాలను సందర్శించి ప్రభుత్వ పథకాలు ఎలా అందినవి, పరిపాలన ఎలా ఉందని వారి మాటల్లో తెలుసుకున్నారు. మా పేదోళ్లని పట్టించుకున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డే అని గర్వంగా చెప్పడంతో నాయకులు సంతృప్తి వ్యక్త పరచారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి గ్రామ కన్వీనర్ కాసెపు అప్పన్న, ఎస్.రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సర్వసిద్ధి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన

ఎస్.రాయవరం : జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి ఉచిత మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ భీమవరం గ్రామ కన్వీనర్ గరగా శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో రూ.36 లక్షలతో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు, పైపులైను నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారం కానుందని, ట్యాంకు నిర్మాణం పూర్తయి, ఇంటింటికి కుళాయిలైను ఏర్పాటు చేసిన తరువాత గోదావరి జలాలు తాగునీరుగా సరఫరా కానున్నాయని చెప్పారు. ట్యాంకు నిర్మాణం పూర్తి కాగానే గ్రామంలో పైపులైను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ వేగి వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పాల్తేరులో ముమ్మరంగా సంక్షేమ ప్రచారం



పాల్తేరులో సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కన్వీనర్లు

పాయకరావుపేట : పాల్తేరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పై అవగాహన కల్పించారు. జగన్ మోహన్ రెడ్డి స్టిక్కర్‌ను డోర్‌లకు అతికించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దేవవరపు వెంకటేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనరు కొంకిపూడి రామకృష్ణ, ఎఎల్‌ఓ కాకాడ కృష్ణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

మునగపాక: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మునగపాక వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన బుధవారం సాయంత్రం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నారని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న వారియర్స్ యూత్ సభ్యులను ఆయన అభినందించారు.



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

తీరనున్న తాగునీటి వెతలు

రాంబిల్లి: జల్‌జీవన్‌మిషన్‌తో తాగునీటి కష్టాలు తీరనున్నాయని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. రాంబిల్లిలో రూ 1.06 కోట్లుతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుందన్నారు. జల్‌జీవన్‌మిషన్ పథకంలో పలు గ్రామాల్లో తాగునీటి బోర్లు, పైపులైన్లు, ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే తాగునీటి సమస్య వుండదన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నం రాజు కిషోర్ పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన పాలక వర్గం సభ్యులు

కశింకోట: మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షునిగా గోకివాడ సూరిబాబు, ఉపాధ్యక్షునిగా నైదాన రాజులు, కార్యదర్శిగా గోకివాడ రాజులు, పాలక వర్గ సభ్యులుగా గోకివాడ అప్పలనాయుడు, దాలిబోయిన రమణ, సారిపల్లి సత్యారావు ఎన్నికయ్యారు. కశింకోట పశు వైద్యాధికారి ఆల్ఫాన్సా జార్జి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వీరిని మోసయ్యపేట సర్పంచ్ మిస్కా రాజేశ్వరి, ఉప సర్పంచ్ గోకివాడ గోవింద తదితరులు అభినందించారు.

ఆధారాల కోసం పోలీసులు విచారణ చేస్తున్నారు


మునగపాక : తమ కుమారుడు హత్యకు కారకులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజును నాగులాపల్లి బాధిత కుటుంబ సభ్యులు కోరారు. గత ఏడాది అక్టోబర్ 12న యల్లపు గంగమహలక్ష్మినాయుడు హత్యకు గురై నెలలు గడుస్తున్నా ఇంతవరకు దోషులు తేలక పోవడాన్ని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన హత్యకు పాల్పడిన వ్యక్తి చాలా తెలివిగా వ్యవహరించాడని పోలీసులకు ఎటువంటి ఆధారాలు ఇంతవరకు లభ్యం కాలేదన్నారు. పోలీసులు ఈ కేసు విచారణలో దర్యాప్తు మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులెవరైనా ఉపేక్షించేది లేదని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడే ఉన్న ఎస్ఐ మహమ్మద్ అలీకి కేసుకు సంబంధించి విచారణ విషయంలో నిందితులను పట్టుకునేలా చూడాలని ఆదేశించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

టీడీపీ హయాంలో ఉపాధి పథకంలో అక్రమాలు

రాంబిల్లి: టీడీపీ హయాంలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని తమ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు చోటులేదని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. రాంబిల్లిలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, టీడీపీ హయాంలో జరిగిన అక్రమాలను గతంలో తాను రికవరీ చేయించానని, అలాగే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం విచారణ చేసి రూపొందించి నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. రూ 7.65 కోట్లు విలువైన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ చేసారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

నేడు ఆర్‌బీకే, సచివాలయాల ప్రారంభం


పాయకరావుపేట : మండల పరిషత్ ఆవరణలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభోత్సవం చేసారన్నారు. 22 లక్షల రూపాయలతో రైతు భరోసా కేంద్రం, 40 లక్షల రూపాయలతో గ్రామ సచివాలయ భవనం నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు రెండు భవనాలు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్‌బీకే, సచివాలయ భవనాలు

ఘనంగా మహావీరుని జయంతి

అనకాపల్లిటౌన్: భగవాన్ మహావీరుని 2599వ జయంతి వేడుకలు సిద్ధార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గొల్లవిల్లి ప్రైమరీ స్కూల్లో బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మహావీరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైన్‌మత స్థాపకులు భగవాన్ మహావీరుని జయంతి వేడుకలు నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. సమాజంలో శాంతి, అహింసలు పెంచేందుకు చేసిన ఆయన కృషిని కొనియాడారు. అంతకు ముందు విద్యార్థులకు మహావీరుని పుస్తకాలు అందజేశారు.



విద్యార్థులకు మహావీరుని పుస్తకాలు అందజేస్తున్న నాగభూషణం

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



బస్సులను ప్రారంభిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్: వేసవిలో పుణ్యక్షేత్రాలకెళ్లే మహిళా భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఉచితంగా నడుపుతున్నట్టు వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం తీర్థయాత్రకు రెండు బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం, అన్నవరం, విశాఖ కనకమహాలక్ష్మి దేవాలయాల దర్శనార్థం ఈ బస్సులను భక్తులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం కల్పిస్తున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మూడో రోజూ భానుడి ప్రతాపం

కశింకోట: మండలంలో వరుసగా మూడో రోజు బుధవారం కూడా భానుడి ప్రతాపం తగ్గలేదు. ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదు అయింది. ఉదయం నుంచి ఎండ వేడిమి ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. ప్రజలు బయట తిరగడానికి భయపడ్డారు. అత్యవసర పని ఉంటే తప్ప బయటికి వెళ్లలేదు. ఒక వైపు ఉక్కపోత, మరో వైపు వేడితో వృద్ధులు, పిల్లలు సతమతమయ్యారు. గురువారం ఇంకా ఉష్ణోగ్రత పెరగగలదని, 40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉంటుందని సమాచారం.